సోమవారం 30, సెప్టెంబర్ 2024

https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

భువనమ్మ పిలుపు మేరకు..
**నేతన్నలకు అండగా ఉందాం**
- పండుగలకు చేనేత వస్త్రాలనే ధరిద్దాం: హోం మంత్రి అనిత

2

**చేనేతలకు అండగా నిలిచారు**
- భువనమ్మకు మంత్రి సవిత ధన్యవాదాలు

2



ALEAP( Association of lady Entrepreneurs of india)

## స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా..
# వేగంగా అడుగులు



- రాష్ట్ర ప్రభుత్వం, సీఐఐ ఉమ్మడి భాగస్వామ్యంతో కన్సల్టేటివ్ ఫోరం ఏర్పాటు
- జీవో నెం. 58 విడుదల
- వారం రోజుల్లో ఏర్పాటు చేస్తామని సీఐఐ సదస్సులో మంత్రి నారా లోకేష్ హామీ
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి

2

# ఇక క్లీన్ మంగళగిరి



- సొంత నిధులతో రంగంలోకి మంత్రి నారా లోకేష్
- సొంతంగా కార్మికులను నియమించి గడ్డి తొలగింపు పనులకు శ్రీకారం
- 5 గడ్డి తొలగింపు మిషన్ల కొనుగోలు
- కార్మికులకు సొంతంగానే జీతాలు చెల్లించనున్న మంత్రి
- నియోజకవర్గంలో రోడ్లకు ఇరువైపుల ఉన్న గడ్డి, పిచ్చిమొక్కలు తొలగింపు
- లోకేష్ చొరవ పట్ల స్థానికుల హర్షం

2లో

వరద సాయంలో పాలుపంచుకున్న వారితో
## నేడు సీఎం చంద్రబాబు సమావేశం
- ధన్యవాదాలు తెలపనున్న ముఖ్యమంత్రి

2

## ప్రతిష్టాత్మకంగా దసరా ఉత్సవాలు

- సామాన్య భక్తులకు పెద్దపీట
- మూలా నక్షత్రం రోజున పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు
- దేవాదాయ మంత్రి ఆనం వెల్లడి

3

ఆర్థికంగా ఇబ్బందులున్నా..
## అభివృద్ధి, సంక్షేమం పరుగులు

- సీఎం చంద్రబాబు అపార అనుభవం అక్కరకు వస్తోంది
- పాలకొల్లులో మంత్రి నారాయణ

3

ఏపీకి ఆహ్వానించినందుకు
## సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

- విశాఖలో అంతర్జాతీయ స్థాయి షాపింగ్ మాల్, 8 స్క్రీన్ల ఐమాక్స్
- విజయవాడ, తిరుపతిలో హైపర్ మార్ట్‌లు
- రాష్ట్రంలో ఆహార శుద్ధి కేంద్రాలు, లాజిస్టిక్ హబ్‌లు నిర్మిస్తాం
- లులు సంస్థ చైర్మన్ యూసఫ్ అలీ వెల్లడి

4



## శ్రీవారి లడ్డూలో నెయ్యి కల్తీపై లోతైన విచారణ

- బాధ్యులైన అందరినీ విచారిస్తాం
- మూడు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు
- సిట్ చీఫ్ త్రిపాఠి వెల్లడి
- టీటీడీ ఈవోతో భేటీ

4

వరదల సమయంలో
## సీఎం చంద్రబాబు పనితీరు అద్భుతం

3

- మంగళగిరిని మంత్రి లోకేష్ ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నారు
- సినీ నటుడు నిఖిల్ ప్రశంసలు

## ఎయిర్ పోర్టుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి
- పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి

4

## శ్రీవారిని దర్శించుకున్న సుప్రీంకోర్టు సీజే జస్టిస్ చంద్రచూడ్

వరద సాయంలో పాలుపంచుకున్న వారితో

# నేడు సీఎం చంద్రబాబు సమావేశం

- ధన్యవాదాలు తెలపనున్న ముఖ్యమంత్రి



అమరావతి(చైతన్యరథం): ఈ నెల మొదట్లో విజయవాడలోని కొన్ని ప్రాంతాలను వరదలు ముంచెత్తిన సమయంలో పది రోజుల పాటు సహాయ కార్యక్రమాలు ముమ్మరంగా కొనసాగాయి. ఎక్కడెక్కడినుంచో వచ్చిన సిబ్బంది, అధికారులు, ఎమ్మెల్యేలు, మంత్రులు సహాయ కార్యక్రమాల్లో పాలు పంచుకున్నారు. సీఎం చంద్రబాబు స్వయంగా పదిరోజుల పాటు కలెక్టరేట్‌నే క్యాంపు ఆఫీసుగా చేసుకుని, పది రోజులపాటు బస్సులోనే ఉండి సహాయ కార్యక్రమాల్లో స్వయంగా పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో వరద సాయంలో భాగస్వాములైన వారితో సీఎం చంద్రబాబు సోమవారం విజయవాడ కలెక్టరేట్లో సమావేశమై వారికి ధన్యవాదాలు తెలపనున్నారు.

ఇలాఉంటే విజయవాడ సహా రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలతో నష్టపోయిన ప్రజలకు ఇటీవల పరిహారం విడుదలైంది. ఆస్తి, పంట నష్టం కింద సుమారు 4 లక్షల మందికి రూ.602 కోట్లు విడుదల చేశారు. ఇప్పటి వరకు ప్రజల ఖాతాల్లో రూ.569 కోట్ల సాయం బ్యాంకు ఖాతాల్లో జమ అయింది. బ్యాంకు ఖాతాలు క్రియాశీలంగా లేని వారికి సోమవారం పరిహారం చెల్లించనున్నారు.

స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా..

# వేగంగా అడుగులు

- రాష్ట్ర ప్రభుత్వం, సీఐఐ ఉమ్మడి భాగస్వామ్యంతో కన్సల్టేటివ్ ఫోరం ఏర్పాటు
- జీవో నెం. 58 విడుదల
- వారం రోజుల్లో ఏర్పాటు చేస్తామని సీఐఐ సదస్సులో మంత్రి నారా లోకేష్ హామీ
- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రానికి పెట్టుబడులు రాబట్టడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చకచకా నిర్ణయాలు తీసుకుంటోంది. మాటల్లోనే కాకుండా చేతల్లో కూడా వేగం చూపిస్తోంది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పాత మాట... ఇప్పటి మాట స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అని చెప్పిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేస్తోంది. ఈ విషయంలో విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీ శాఖల మంత్రి నారా లోకేష్ మరింత చొరవ తీసుకుంటున్నారు. భారత పరిశ్రమల సమాఖ్య(సీఐఐ)కు హామీ ఇచ్చినట్లుగానే.. పెట్టుబడిదారులు తాము ఎదుర్కొంటున్న సమస్యలపై నేరుగా ప్రభుత్వంతో చర్చించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం, సీఐఐ ఉమ్మడి భాగస్వామ్యంతో కన్సల్టేటివ్ ఫోరం ఏర్పాటు చేశారు. ఫోరం ఏర్పాటుచేస్తూ పరిశ్రమల శాఖ జీవో నెం.58ని విడుదల చేసింది. ఇటీవల విజయవాడలోని తాజ్ వివాంత హోటల్‌లో సీఐఐ ఆధ్వర్యంలో నిర్వహించిన సదరన్ రీజనల్ కౌన్సిల్ సదస్సులో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. పెట్టుబడిదారులు నేరుగా ప్రభుత్వంతో చర్చించేందుకు కన్సల్టేటివ్ ఫోరం ఏర్పాటుచేయాలని ఈ సందర్భంగా సీఐఐ ప్రతినిధులు కోరారు. దీనిపై స్పందించిన మంత్రి లోకేష్ వారం రోజుల్లో కన్సల్టేటివ్ ఫోరం ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం, సీఐఐ మధ్య కన్సల్టేటివ్ ఫోరం ఏర్పాటుచేస్తూ జీవో విడుదల చేసి ఇచ్చిన మాటను మంత్రి లోకేష్ నిలబెట్టుకున్నారు. ప్రాథమికంగా రెండేళ్ల కాలపరిమితితో ఏర్పాటయిన ఈ ఫోరం.. పెట్టుబడుల ఆకర్షణలో ప్రభుత్వం, పారిశ్రామికవేత్తల మధ్య సంధానకర్తగా వ్యవహరించనుంది. ఆర్టీజీఎస్ మంత్రిగా ఉన్న నారా లోకేష్ ఈ ఫోరం ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు. వివిధ ప్రభుత్వ శాఖల మధ్య ఆర్టీజీఎస్ సమన్వయం చేయనుంది. రాష్ట్రంలో పెట్టుబడుల అనుకూల వాతావరణం, పారిశ్రామికవేత్తలకు సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ కోసం ఇప్పటికే ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డును ప్రభుత్వం పునరుద్ధరించింది. వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది.



# ఇక క్లీన్ మంగళగిరి..!

- సొంత నిధులతో రంగంలోకి మంత్రి నారా లోకేష్
- సొంతంగా కార్మికులను నియమించి గడ్డి తొలగింపు పనులకు శ్రీకారం
- 5 గడ్డి తొలగింపు మిషన్ల కొనుగోలు
- కార్మికులకు సొంతంగానే జీతాలు చెల్లించనున్న మంత్రి
- నియోజకవర్గంలో రోడ్లకు ఇరువైపుల ఉన్న గడ్డి, పిచ్చిమొక్కలు తొలగింపు
- లోకేష్ చొరవ పట్ల స్థానికుల హర్షం

మంగళగిరి (చైతన్యరథం): ప్రతిపక్షంలో ఉన్నప్పుడే మంగళగిరి నియోజకవర్గంలో సొంత నిధులతో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిన యువనేత నారా లోకేష్, ఇప్పుడు అధికారంలోకి వచ్చి విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్, ఆర్టీజీ శాఖల మంత్రి అయినప్పటికీ అదే ఒరవడి కొనసాగిస్తున్నారు. పరిశుభ్ర మంగళగిరి కోసం సొంత నిధులు ఖర్చు చేస్తున్నారు. మంగళగిరి నియోజకవర్గాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచటంపై మంత్రి లోకేష్ దృష్టి సారించారు. నియోజకవర్గాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు సొంతంగా 5 గ్రాస్ కటింగ్ మిషన్లు కొనుగోలు చేయడంతో పాటు వాటిని వినియోగించి పిచ్చిమొక్కలు, గడ్డి తొలగించేందుకు ఐదుగురు కార్మికులను నియమించారు. వీరికి అవసరమైన జీతభత్యాలను నారా లోకేష్ సొంత నిధుల నుంచే వెచ్చిస్తున్నారు.

ఒక్కో గ్రాస్ కటింగ్ మిషన్ కొనుగోలుకు రూ.18వేల వరకు ఖర్చు చేశారు. ఆదివారం ఉదయం నుంచే మంగళగిరి పట్టణంలోని పానకాల శ్రీలక్ష్మి నరసింహస్వామి ఘాట్ రోడ్డుతో పాటు పలు ప్రాంతాల్లో యంత్రాల సాయంతో గడ్డిని, పిచ్చి మొక్కలను తొలగించారు. ఆయా పనులను టీడీపీ నాయకులు దగ్గరుండి పర్యవేక్షించారు. మంగళగిరి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు మంత్రి నారా లోకేష్ చూపిస్తున్న చొరవ పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.







# భువనమ్మ పిలుపు మేరకు.. నేతన్నలకు అండగా ఉందాం

- పండుగలకు చేనేత వస్త్రాలనే ధరిద్దాం: హోం మంత్రి అనిత



అమరావతి(చైతన్యరథం): పండుగలకు చేనేత వస్త్రాలను ధరించి నేతన్నలకు అండగా ఉందామని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి పిలుపు మేరకు చేనేతలకు తెలుగు ప్రజలు అండగా నిలవాలని అనిత అన్నారు. ఒంట్లో నరాలను దారాలుగా పోగు చేసి కష్టపడి..రక్తంతో రంగులు అద్దుతూ చెమటోడ్చే చేనేతల బతుకు చిత్రం మార్చడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలన్నారు. రాబోయే రోజుల్లో వరుస పండుగల నేపథ్యంలో మన సంస్కృతి, సంప్రదాయాలను చాటే చేనేత వస్త్రాలను ధరించడంతో పాటు చేనేతల కళారూపాలకు పెద్దపీట వేయాలన్నారు. మన ఇంట్లో ఆనందంగా పండుగ చేసుకోవడంతో పాటు చేనేత వస్త్రాలపై ఆధారపడి బతికే అందరి ఇళ్లల్లో పండుగ సంతోషం నింపాలని హోంమంత్రి అనిత ఆకాంక్షించారు.

# చేనేతలకు అండగా నిలిచారు

భువనమ్మకు మంత్రి సవిత ధన్యవాదాలు



అమరావతి(చైతన్యరథం): చేనేత కార్మికులకు అండగా నిలిచిన సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరికి రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత ధన్యవాదాలు తెలిపారు. రాబోయే పండగల నేపథ్యంలో చేనేత వస్త్రాలు ధరించాలని, నేతన్న కళాకారులకు అండగా నిలవాలని నారా భువనేశ్వరి పిలుపునివ్వడంపై మంత్రి సవిత హర్షం వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆదివారం మంత్రి ఒక ప్రకటన విడుదల చేశారు. నిజం గెలవాలి పర్యటన సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికుల కష్టాలను నారా భువనేశ్వరి స్వయంగా చూశారన్నారు. యాసిడ్, బ్లీచింగ్ మధ్య నిల్చొని ఆరోగ్యాన్ని కూడా లెక్కచేయకుండా రేయింబవళ్లు ప్రజల కోసం వస్త్రాలు రూపొందిస్తున్న చేనేతలకు అండగా నిలవాలని, రాబోయే దసరా, దీపావళి పండలకు చేనేత వస్త్రాలు కొనుగోలు చేద్దామని భువనేశ్వరి పిలుపునివ్వడం సంతోషకరమన్నారు. చేనేత కార్మికులను ఆదుకోవడానికి సీఎం చంద్రబాబు ఇప్పటికే కార్యాచరణ చేపట్టారన్నారు. నేతన్నల అభివృద్ధికి 2014-19లో అమలు చేసిన పథకాలన్నింటినీ మరోసారి అమలు చేయనున్నామని మంత్రి వెల్లడించారు. ఇటీవల నిర్వహించిన చేనేత, జౌళి శాఖ సమీక్షలోనూ సీఎం చంద్రబాబునాయుడు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారన్నారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీని రాష్ట్ర ప్రభుత్వమే భరించేలా నిర్ణయం తీసుకున్నామన్నారు. సాధారణ మగ్గాలకు 200 యూనిట్లు, మర మగ్గాలకు 500 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇవ్వనున్నామన్నారు. చేనేతలకు 365 రోజులూ పని కల్పించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. ప్రస్తుతమున్న ట్రెండ్‌కు అనుగుణంగా దుస్తుల తయారీలో నేతన్నలకు శిక్షణ ఇవ్వడంతో పాటు మార్కెటింగ్ సదుపాయం కూడా కల్పించనున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎగ్జిబిషన్లు నిర్వహించడం, ఈ కామర్స్ లో చేనేత వస్త్రాల విక్రయాలకు అవకాశం కల్పించడంపై తమ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. భువనమ్మ పిలుపు మేరకు ప్రజలు స్పందించి, చేనేత వస్త్రాలను వారానికి ఒకసారైనా ధరించాలని మంత్రి సవిత ఆ ప్రకటనలో కోరారు.

చైతన్యరథం

## ఆర్థికంగా ఇబ్బందులున్నా..

# అభివృద్ధి, సంక్షేమం పరుగులు

### సీఎం చంద్రబాబు అపార అనుభవం అక్కరకు వస్తోంది - టిడ్కో ఇళ్లను ప్రారంభానికి సిద్ధం చేయాలి - పాలకొల్లులో మంత్రి నారాయణ



పాలకొల్లు(చైతన్యరథం): రాష్ట్ర బడ్జెట్ లోటులో ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమానికి నిధుల కొరత లేకుండా చూస్తున్నామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖల మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. గత ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసి, భారీగా అప్పులు చేసి వెళ్లిపోయినా చంద్రబాబు అపార అనుభవంతో సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. పేదలకు రూ.5కే అన్నం పెట్టే అన్న క్యాంటీన్లను గత ప్రభుత్వం ఎందుకు మూసేసిందో తెలియదన్నారు. ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో జల వనరుల శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడుతో కలిసి పట్టణంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను మంత్రి నారాయణ పరిశీలించారు. మున్సిపల్ హెడ్ వాటర్ వర్క్స్, హిందూ శ్మశాన వాటిక ( కైలాస వనం), డంపింగ్ యార్డు, డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలామ్ హెల్త్ పార్క్, నారా చంద్రబాబు నాయుడు ఉద్యానవనం, బొండాడ వెంకటరాజు గుప్తా ఎన్టీఆర్ కళాక్షేత్రం, అన్న క్యాంటీన్, ఎన్టీఆర్ టిడ్కో ఇండ్ల సముదాయాన్ని మంత్రులు పరిశీలించారు. పాలకొల్లు పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పెండింగ్‌లో ఉన్న పనులను మంత్రి నిమ్మల రామానాయుడు వివరించారు. ఆ తర్వాత మున్సిపల్ ఆఫీస్‌లో అధికారులతో సమీక్ష జరిపారు. గత టీడీపీ ప్రభుత్వంలో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను వైసీపీ ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో ఎక్కడికక్కడ నిలిచిపోయినట్లు అధికారులు వివరించారు. దీనిపై మంత్రి నారాయణ స్పందిస్తూ, ముందుగా టిడ్కో ఇళ్ల వద్ద అవసరమైన మౌలిక వసతులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. పట్టణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి ప్రారంభోత్సవాలకు సిద్ధం చేయాలన్నారు. టిడ్కో ఇళ్ల కోసం ఎంత ఖర్చయినా పర్వాలేదని సీఎం చంద్రబాబు చెప్పారన్నారు. పేదలు సౌకర్యంగా నివసించేలా ఇళ్లు నిర్మించాలని చంద్రబాబు ఆదేశించారన్నారు.



ఆధునిక సౌకర్యాలతో టిడ్కో ఇళ్లను నిర్మించాం. గత ప్రభుత్వం టిడ్కో ఇళ్లను సర్వనాశనం చేసింది. టిడ్కో ఇళ్ల లబ్ధిదారుల సంఖ్యను కూడా తగ్గించింది. పేదలు ఎల్లప్పుడూ పేదలుగా ఉండాలనేది గత సీఎం జగన్ ఆలోచన. 2014లో టీడీపీ హయాంలో 9 లక్షల గృహాలు మంజూరు చేశామని... ఇది దేశంలోనే రికార్డు అని మంత్రి నారాయణ తెలిపారు. టిడ్కో గృహాలను నిర్మించిన కాంట్రాక్టర్లకు జగనన్న ప్రభుత్వం దబ్బులు చెల్లించలేదని అన్నారు. ఆ కాంట్రాక్టర్లు ఇప్పుడు బిల్లుల కోసం తిరుగుతున్నారని చెప్పారు.

**విభజన కంటే జగన్ పాలనలోనే ఎక్కువ నష్టం: నిమ్మల**

రాష్ట్ర విభజన కంటే జగన్ పాలన వల్ల ఏపీకి ఎక్కువ నష్టం జరిగిందని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో పేదల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. పేదల కల నెరవేరాలన్న ఉద్దేశంతో సీఎం చంద్రబాబు టిడ్కో ఇళ్ల నిర్మాణం చేపట్టారని అన్నారు. టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన ఇళ్లను పూర్తి చేయకుండా.. వైసీపీ ప్రభుత్వంలో ఆ ఇళ్లకు వైసీపీ రంగులు వేసుకున్నారని విమర్శించారు. ఐదేళ్ల పాటు జగన్ పాలనలో ప్రజా సమస్యలపై ఎన్నో ఉద్యమాలు చేశామని అన్నారు. టిడ్కో ఇళ్లకు పూర్వ వైభవం తీసుకురావడం కోసం కూటమి ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందని అన్నారు. ఇళ్ల లబ్ధిదారులను బలవంతంగా రుణగ్రస్తులను చేశారని చెప్పారు. పది శాతం పెండింగ్ పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు అతి త్వరలో ఇళ్లను అందజేస్తామని తెలిపారు. ఒక్క పాలకొల్లులోనే రూ.150 కోట్లు ఇళ్లను తాకట్టుపెట్టి ఆ నిధులను మాజీ సీఎం జగన్ పక్క దారి పట్టించారని విమర్శించారు. ప్రపంచ స్థాయిలో మళ్లీ అమరావతిని తిరిగి నిలబెట్టేందుకు మంత్రి నారాయణ కృషి చేస్తున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరు చదలవాద నాగరాణి, ఆర్డీవో ఎం.అచ్యుత అంబరీష్, శాసనమండలి మాజీ సభ్యుడు అంగర రామ్మోహన్, మునిసిపల్ కమిషనర్ విజయ సారథి, టీడిపి, బిజెపి, జనసేన నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**మంత్రి నారాయణ కు ఘన స్వాగతం**

పాలకొల్లులో అభివృద్ధి పనులు పరిశీలనకు వచ్చిన రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ కు ఘన స్వాగతం లభించింది. ముందుగా బ్రాడీపేట మున్సిపల్ వాటర్ వర్క్సనకు చేరుకున్న ఆయనకు మంత్రి నిమ్మల రామానాయుడు శాలువా కప్పి గజమాల వేసి సత్కరించారు. కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో పూలమాలలు వేశారు.

## వరదల సమయంలో సీఎం చంద్రబాబు పనితీరు అద్భుతం

**- మంగళగిరిని మంత్రి లోకేష్ ఆదర్శంగా తీర్చదిద్దుతున్నారు**

**- సినీ నటుడు నిఖిల్ ప్రశంసలు**




మంగళగిరి (చైతన్యరథం): విజయవాడకు ఇటీవల సంభవించిన వరదల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అద్భుతంగా పనిచేశారని ప్రముఖ సినీ నటుడు నిఖిల్ సిద్ధార్థ ప్రశంసల వర్షం కురిపించారు. 'అందరి కోసం అమరావతి' పేరుతో ఆదివారం మంగళగిరిలో నిర్వహించిన 10కే, 5కే, 3కే రన్‌ను నిఖిల్, ఆరో బెటాలియన్ కమాండెంట్ నగేశ్‌బాబు, కామన్వెల్త్ క్రీడాకారిణి ఘట్టమనేని సాయిరేవతి ప్రారంభించారు.

ఈ సందర్భంగా నిఖిల్ మీడియాతో మాట్లాడుతూ.. ఏపీ ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు ఇలాంటి రన్స్ అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి దాదాపు ఐదువేలమంది హాజరు కావడం ఆనందంగా ఉందన్నారు. విజయవాడ వరదల సమయంలో చంద్రబాబు, ఇతర మంత్రులు అద్భుతంగా పనిచేశారని కొనియాడారు. సాధారణంగా ఇలాంటి విపత్తులు వస్తే కోలుకునేందుకు చాలా సమయం పడుతుందని కానీ, ప్రభుత్వం సత్వరం స్పందించడం వల్ల ప్రజలు చాలా త్వరగా కోలుకున్నారని పేర్కొన్నారు.

తాను మంగళగిరి వస్తున్నప్పుడు చూశానని, రోడ్లు కానీ, పరిసరాలు, లైటింగ్ ఎంతో బాగున్నాయని చెప్పారు. మంగళగిరి నియోజకవర్గాన్ని మంత్రి లోకేశ్ రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతున్నారని ప్రశంసించారు. కార్తికేయ-2 సీక్వెల్ కార్తికేయ-3 సినిమా గురించి మాట్లాడుతూ త్వరలోనే ఆ సినిమా షూటింగ్ ప్రారంభమవుతుందని నిఖిల్ చెప్పారు. ప్రస్తుతం స్వయంభూ షూటింగ్ జరుగుతున్నట్లు నిఖిల్ తెలిపారు.

# ప్రతిష్టాత్మకంగా దసరా ఉత్సవాలు

**- సామాన్య భక్తులకు పెద్దపీట**

**- మూలా నక్షత్రం రోజున పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు**

**- దేవాదాయ మంత్రి ఆనం వెల్లడి**



విజయవాడ(చైతన్యరథం): ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయంలో ఈ ఏడాది జరగనున్న దసరా ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామని, ఎన్డీఏ కూటమి ప్రభుత్వ హయాంలో మొదటిసారిగా నిర్వహిస్తున్న దసరా వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. అక్టోబర్ 3 నుంచి 12 వరకు జరిగే ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించే విషయమై విజయవాడ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు యలమంచిలి సత్యనారాయణ (సుజన చౌదరి), జిల్లా కలెక్టర్ సృజన, పోలీస్ కమిషనర్ సీవీ రాజశేఖర్, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీరాం సత్యనారాయణ, ఆలయ ఈవో కేఎస్ రామారావు ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఆదివారం మంత్రి రామనారాయణ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ వారికి ఏ విధమైన అసౌకర్యాలు కలగకుండా త్వరితగతిన అమ్మవారి దర్శనం అయ్యేలా చర్యలను తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే స్థానిక శాసనసభ్యుడు సుజనా చౌదరి పలుమార్లు ఉత్సవాల నిర్వహణపై సమీక్షలను నిర్వహించారన్నారు. మూలా నక్షత్రం రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుటుంబ సమేతంగా విచ్చేసి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారని తెలిపారు. పార్లమెంటు సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని), శాసనసభ్యుడు సుజనా చౌదరి, కూటమి నాయకుల సహకారంతో ఐక్యంగా అమ్మవారి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామన్నారు. రోజుకి రెండు లక్షలమంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది కనుక గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని ఎటువంటి ఆటంకాలు జరగకుండా అందరి సహకారంతో విజయవంతంగా దసరా ఉత్సవాలను విజయవంతంగా నిర్వహిస్తామన్నారు.

**పటిష్ట ఏర్పాట్లు: ఎమ్మెల్యే సుజనా చౌదరి**

ఉత్సవాల నిర్వహణ కోసం ఏర్పాట్లు పూర్తవుతున్నాయని సామాన్య భక్తులకు పెద్దపీట వేసేలా ఏర్పాట్లను ముమ్మరం చేసామన్నారు. వివిఐపీల దర్శనం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు వృద్ధులు, దివ్యాంగుల కోసం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు దర్శన ఏర్పాట్లను చేసామన్నారు. వీఐపీల దర్శన సమయంలోనూ సామాన్య భక్తుల దర్శనాలు నిరంతరం కొనసాగుతూ ఉంటాయన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. పరిశుభ్రమైన వాతావరణంలో భక్తులందరికీ అన్నప్రసాదాలు, వాటర్ బాటిళ్లను అందజేస్తామన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, కూటమినేతల సహకారంతో దసరా ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించడానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే సుజనా చౌదరి తెలిపారు.

# ఏపీకి ఆహ్వానించినందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

- విశాఖలో అంతర్జాతీయ స్థాయి షాపింగ్ మాల్, 8 స్క్రీన్ల ఐమాక్స్
- విజయవాడ, తిరుపతిలో హైపర్ మార్ట్‌లు
- రాష్ట్రంలో ఆహార శుద్ధి కేంద్రాలు, లాజిస్టిక్ హబ్‌లు నిర్మిస్తాం
- లులు సంస్థ చైర్మన్ యూసఫ్ అలీ వెల్లడి

అమరావతి (చైతన్యరథం) : 'లులు' సంస్థను ఏపీకి ఆహ్వానించినందుకు సీఎం చంద్రబాబుకు ఆ సంస్థ చైర్మన్ యూసుఫ్ అలీ కృతజ్ఞతలు తెలిపారు. చంద్రబాబుతో 18 ఏళ్ల అనుబంధం ఉన్నట్లు గుర్తు చేసుకున్నారు. ఆయనతో శనివారం జరిపిన చర్చలు ఫలప్రదమయ్యాయయని అన్నారు. విశాఖలో అంతర్జాతీయస్థాయి షాపింగ్ మాల్ నిర్మిస్తామన్నారు. షాపింగ్ మాల్లో 8 స్క్రీన్లతో ఐమాక్స్ మల్టీప్లెక్స్ నిర్మిస్తాం. విజయవాడ, తిరుపతిలో హైపర్ మార్ట్‌లు నిర్మిస్తాం. ఏపీలో ఆధునిక ఆహారశుద్ధి కేంద్రాలు, లాజిస్టిక్ హబ్‌లు నిర్మిస్తాం" అని ఎక్స్ వేదిగా యూసఫ్ అలీ వెల్లడించారు.

ఏపీ సీఎం చంద్రబాబును లులూ గ్రూప్ అధినేత యూసుఫ్ అలీ శనివారం అమరావతిలో కలిసిన సంగతి తెలిసిందే. లులూ మళ్లీ వస్తోందంటూ సంతోషం వ్యక్తం చేస్తూ సీఎం చంద్రబాబు ఎక్స్‌లో ప్రకటన కూడా చేశారు. ఈ నేపథ్యంలో, చంద్రబాబును కలవడంపై యూసుఫ్ అలీ ఆదివారం సోషల్ మీడియా ద్వారా స్పందించారు.

## పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడి

### కేంద్ర హెూంమంత్రి అమిత్ షాతో భేటీ



ఢిల్లీ: కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షాతో పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడు ఢిల్లీలో ఆదివారం భేటీ అయ్యారు. భారత విమానయాన రంగం పురోగతిపై సమీక్షించడంతోపాటు ఎయిర్ పోర్టుల్లో మౌలిక సదుపాయాల కల్పనపై అమిత్ షాతో చర్చించారు. దేశవ్యాప్తంగా కొత్త విమానాశ్రయాలుల అభివృద్ధి, పాత వాటిలో మౌలిక సదుపాయాలు కల్పించడంపై ఎన్డీయే సర్కార్ ప్రత్యేకంగా దృష్టి పెట్టిందని రామ్మోహన్ అన్నారు.

విమానాశ్రయాల అభివృద్ధికి ఎన్డీయే సర్కార్ కట్టుబడి ఉంది. కేంద్ర బడ్జెట్‌లో అందుకు తగినట్లే నిధుల కేటాయింపులు జరిపాం. అన్ని రాష్ట్రాలకు కనెక్టివిటీ పెంచేందుకు కృషి చేస్తున్నాం. అమిత్ షాతో కూడా ఇదే అంశంపై చర్చించా. ఎయిర్ పోర్టుల్లో ఉన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లా. సమస్యల పరిష్కారానికి ఆయన సానుకూలత వ్యక్తం చేశారని రామ్మోహన్ పేర్కొన్నారు.

# శ్రీవారి లడ్డూలో నెయ్యి కల్తీపై లోతైన విచారణ

- బాధ్యులైన అందరినీ విచారిస్తాం
- మూడు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు
- సిట్ చీఫ్ త్రిపాఠి వెల్లడి
- టీటీడీ ఈవోతో భేటీ

తిరుపతి (చైతన్యరథం): తిరుమల లడ్డూలో నెయ్యి కల్తీ వాడకంపై లోతైన విచారణ చేస్తామని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) చీఫ్ సర్వశ్రేష్ఠ త్రిపాఠి తెలిపారు. తిరుపతి తూర్పు పోలీసు స్టేషన్ లో నమోదైన కేసు కూడా సిట్‌కు బదిలీ అయిందని చెప్పారు. నెయ్యి సరఫరా చేసిన ఏఆర్ డెయిరీపై విచారణ చేస్తామని పేర్కొన్నారు. సిట్ అధికారులు మూడు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు నిర్వహిస్తున్నారని వివరించారు. కల్తీ నెయ్యికి బాధ్యులైన అందరినీ విచారిస్తామన్నారు. నివేదిక సమర్పించడానికి కాలపరిమితి లేదని తెలిపారు.

కల్తీ నెయ్యి వ్యవహారంపై రెండో రోజు ఆదివారం 'సిట్' విచారణ సాగింది. తిరుపతి పోలీసు అతిథి గృహంలో మరోసారి సిట్ సభ్యులు భేటీ అయ్యారు. మూడు బృందాలుగా ఏర్పడి విచారణ చేపడుతున్నారు. డీఐజీ గోపీనాథ్ జెట్టీ, ఎస్పీ హర్షవర్ధన్ రాజు, అదనపు ఎస్పీ వెంకటరావు నేతృత్వంలో దర్యాప్తు చేస్తున్నారు. టీటీడీ ప్రొక్యూర్మెంట్ జీఎం ఇచ్చిన ఫిర్యాదులోని అంశాలను సిట్ బృందం పరిశీలిస్తోంది. టీటీడీ బోర్డు దగ్గర నుంచి అధికారులు, సిబ్బంది పాత్ర వరకు అన్ని అంశాలపై దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం ఈవో శ్యామలరావును కలిసి, పూర్తి వివరాలు తెలుసుకున్నారు. తిరుపతిలోని ఈవో బంగ్లాలో ఈ సమావేశం జరిగింది. తరువాత సిట్ చీఫ్ సర్వశ్రేష్ఠ త్రిపాఠి మీడియాతో మాట్లాడారు.

కల్తీ నెయ్యి వ్యవహారంపై సిట్ సభ్యులు పలు ప్రాంతాలకు వెళ్లి విచారణ చేపట్టనున్నారు. తమిళనాడులోని దుండిగల్‌లో ఏఆర్ డెయిరీ ఫుడ్స్ సంస్థను పరిశీలించనున్నారు. తిరుమలలో లడ్డూపోటు, విక్రయ కేంద్రాలను మరో బృందం పరిశీలించనుంది. లడ్డూ తయారీ ముడి సరుకులపై ఆరా తీయనున్నారు. తయారీలో పాల్గొంటున్న శ్రీవైష్ణవులను ప్రశ్నించనున్నారు. తితిదే పరిపాలన భవనంలో మరో బృందం విచారణ చేపట్టనుంది. నెయ్యి కొనుగోలు, ఒప్పందాలు పరిశీలించనుంది. దీనికి సంబంధించి తితిదే, ఏఆర్ డెయిరీ మధ్య ఒప్పందాలపై ఆరా తీయనున్నారు.

# శ్రీవారిని దర్శించుకున్న సుప్రీంకోర్టు సీజే జస్టిస్ చంద్రచూడ్





తిరుమల (చైతన్యరథం): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (చీఫ్ జస్టిస్-సీజే) జస్టిస్ డీవై చంద్రచూడ్ ఆదివారం ఉదయం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన జస్టిస్ చంద్రచూడ్‌కు వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వద్ద టీటీడీ ఈవో శ్యామల రావు, అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం రంగనాయకుల మండపంలో చీఫ్ జస్టిస్‌కు వేద పండితులు వేదాశీర్వచనం అందించారు. అనంతరం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి టీటీడీ ఈవో తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీవీఎస్వో శ్రీధర్, డిప్యూటీ ఈవోలు లోకనాథం, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

**సాదర వీడ్కోలు**

సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ తిరుపతి జిల్లాలో రెండు రోజుల పర్యటన ముగించుకుని ఆదివారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయం నుండి తిరుగు ప్రయాణం అయ్యారు. ఆయనకు విమానాశ్రయంలో సాదర వీడ్కోలు లభించింది. పలువురు న్యాయమూర్తులు, జిల్లా అధికారులు ఆయనకు వీడ్కోలు పలికారు.

# అమ్మవారి దర్శనంలో సామాన్య భక్తులకే పెద్దపీట

- దసరా ఉత్సవాల విజయవంతానికి మీడియా సహకారం అవసరం
- అధికారులు, మీడియా సమన్వయంతో భక్తులకు మెరుగైన సేవలు
- జిల్లా కలెక్టర్ సృజన, పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు వెల్లడి

విజయవాడ (చైతన్యరథం): దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనే లక్షలాది మంది సామాన్య భక్తులకు మెరుగైన సేవలందించి త్వరితగతిన అమ్మవారి దర్శనం కల్పించి ఉత్సవాలు విజయవంతం చేయడంలో మీడియా సహకారం అవసరమని జిల్లా కలెక్టర్ డా. జి.సృజన, పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు అన్నారు.

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు మీడియా ప్రతినిధుల సలహాలు సూచనలు స్వీకరించేందుకు ఆదివారం కలెక్టర్ సృజన, పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు.. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ గౌతమిశాలి, శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఈవో కేఎస్ రామారావు, తదితరులతో కలిసి పోలీస్ కమిషనరేట్ సమావేశ మందిరంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, పోలీస్, దేవాదాయ అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ సృజన మాట్లాడుతూ గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన అమ్మవారి దర్శనం జరిపించేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించడంలో మీడియా ప్రతినిధుల సలహాలు, సూచనలు అవసరమన్నారు. వీటిని పరిగణనలోకి తీసుకొని ఈ ఏడాది ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే దసరా ఉత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తిచేస్తున్నట్లు తెలిపారు.

సమావేశంలో పాల్గొన్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు దసరా ఉత్సవాల నిర్వహణపై పలు సూచనలు సలహాలు అందజేశారు. మీడియా ప్రతినిధుల సూచనలపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ సామాన్య భక్తులకు సంతృప్తికరంగా ఉండేలా అమ్మవారి దర్శనం కల్పించాలనే లక్ష్యంతో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని క్యూలైన్లు, స్నాన ఘట్టాలు, మరుగుదొడ్ల ఏర్పాటుతో పాటు నిరంతరం తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టామన్నారు క్యూలైన్లలో వేచి ఉండే భక్తులకు అమ్మవారి దర్శనం త్వరితగతిన జరిపించడంపై ప్రత్యేక దృష్టిపెట్టామన్నారు. భక్తుల దాహార్తిని తీర్చడానికి 27 ప్రాంతాలలో తాగునీటి బాటిల్స్ సరఫరా చేసేందుకు మూడు షిఫ్టుల్లో సిబ్బందిని నియమిస్తున్నామన్నారు. భక్తుల సౌకర్యార్థం లగేజీ, చెప్పులు భద్రపరుచుకునేందుకు 30 క్లాక్ రూములను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసే వీఐపీ, వీవీఐపీలు, ప్రజాప్రతినిధులు కోసం ప్రత్యేక సమయాన్ని కేటాయించి వారికిా సమయాల్లోనే దర్శనం కల్పించి సామాన్య భక్తులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. అమ్మవారి ఉత్సవాల నిర్వహణపై ఎప్పటికప్పుడు భక్తులకు సమాచారాన్ని అందించడంలో మీడియా పాత్ర కీలకమన్నారు. మీడియా ప్రతినిధులకు అవసరమైన ప్రత్యేక డ్యూటీ పాసులను జారీ జారీచేయనున్నామని తెలిపారు. ఎప్పటిలాగే కొండపైన రాజగోపురం సమీపంలో మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేసి, మీడియా ప్రతినిధుల కోసం కంప్యూటర్లు, ఇంటర్నెట్ వైఫై వంటి సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మీడియా ప్రతినిధులకు ఎదురయ్యే ఇబ్బందులను సత్వరం పరిష్కరించేలా పోలీస్, దేవాదాయ శాఖ అధికారుల సమన్వయానికి సమాచార శాఖ అధికారులను లైజనింగ్ అధికారులుగా నియమిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 7 గం. నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, మధ్యాహ్నం ఒంటిగంట నుంచి రాత్రి 9 గంటల వరకు, రాత్రి 9 గంటల నుంచి ఉదయం 7 గంటల వరకు ఇలా.. మూడు షిఫ్టుల్లో సమన్వయ శాఖల అధికారులు, సిబ్బంది విధుల్లో ఉండేలా ప్రతిపాదనలు రూపొందించామన్నారు.

**లోటుపాట్లను సరిచేసుకుంటూ ముందుకెళ్తాం: సీపీ రాజశేఖరబాబు**

నగర పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు మాట్లాడుతూ గతేడాది ప్రింట్ మీడియాలో ప్రచురితమైన కథనాలను సమావేశంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. గత ఉత్సవాలలో ఎక్కడైతే లోటుపాట్లు జరిగాయని మీడియా ప్రతినిధులు కథనాల ద్వారా తెలియచేశారో అటువంటివి పునరావృతం కాకుండా చూసేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నామన్నారు. గతేడాది కంటే ఈ ఏడాది భక్తుల సంఖ్య అధికంగా ఉండవచ్చునన్న అంచనాల నేపథ్యంలో అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని ఆయన తెలిపారు. అయితే భక్తుల మనోభావాలు దెబ్బ తినకుండా వాస్తవ సమాచారాన్ని భక్తులకు అందించి దసరా ఉత్సవాల విజయవంతంలో సహకరించాలని మీడియా ప్రతినిధులకు పోలీస్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు. అనవసర గందరగోళం తలెత్తకుండా ఉండేందుకు ఈ ఏడాది యూనిఫామ్‌తో పోలీస్ అధికారులు, సిబ్బందిని అమ్మవారి దర్శనానికి అనుమతించడం లేదని ఆయన తెలిపారు. మూలా నక్షత్రం రోజున మీడియా ప్రతినిధులకు ఇబ్బంది కలగకుండా మీడియా ప్రతినిధుల ద్విచక్ర వాహనాలను మోడల్ గెస్ట్ హౌస్ వరకు అనుమతించేలా చర్యలు తీసుకుంటామని, ఇందుకు రాజీవ్ గాంధీ పార్క్, భవానీపురం ఫ్లై ఓవర్ వద్ద విధులు నిర్వర్తించే పోలీస్ అధికారులకు, సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నామన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది, పోలీస్, దేవాదాయ శాఖ అధికారులు, సిబ్బంది, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి దసరా ఉత్సవాలను విజయవంతం చేసి రానున్న ఏడాదికి స్ఫూర్తిదాయకంగా నిలిచేలా కృషిచేద్దామని ఆయన కోరారు. ఈ సమావేశంలో డీసీపీలు ఏబీటీఎస్ ఉదయరాణి, ఎం.కృష్ణమూర్తి నాయుడు, అడిషనల్ డీసీపీ జి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# గుంటతిప్ప డ్రెయిన్, పుల్లేటి కాలువ సమస్యల పరిష్కారానికి చర్యలు

## ఎమ్మెల్యే గద్దె రామమోహన్ హామీ

విజయవాడ, చైతన్యరథం: తూర్పు నియోజకవర్గంలో మొదటగా చేపట్టే ప్రాజెక్టు గుంటతిప్ప డ్రెయిన్ అని, ఎంత వర్షం పడినా చుక్క నీరు కూడా నిల్వ ఉండకుండా ఉండేలా చర్యలు తీసుకుంటామని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ తెలిపారు. పుల్లేటి కాలువ సమస్యను కూడా పరిష్కరిస్తామని చెప్పారు. నగరంలోని ఎంత పెద్ద వర్షం కురిసినా నియోజకవర్గ పరిధిలోని రోడ్లపై ఎక్కడా చుక్క నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఆదివారం తూర్పు నియోజకవర్గ పరిధిలోని 4వ డివిజన్ ఓంకార్ కళ్యాణ మండపంలో వరదల సమయంలో విధులకు హాజరవుతూ ప్రమాదానికి గురైన 12 మంది పారిశుద్ధ్య కార్మికులకు 4వ డివిజన్లోని అన్ని కాలనీల అసోసియేషన్ వారు అందించిన రూ.2 లక్షల 15 వేలను 12 మంది పారిశుధ్య కార్మికులకు ఎమ్మెల్యే గద్దె చేతులమీదుగా పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామమోహన్ మాట్లాడుతూ వరదల సమయంలో విధులకు హాజరయ్యేందుకు వెళుతుండగా ప్రమాదానికి గురైన పారిశుధ్య కార్మికులకు 4వ డివిజన్ కాలనీవాసులు సహాయం చేయడం అభినందనీయమన్నారు. విజయవాడ నగరంలో ఒకే రోజు 17 సెంటీమీటర్ల వర్షం కురవడం నగర చరిత్రలో రికార్డు అని అన్నారు. గత



టీడీపీ ప్రభుత్వం హయంలోనే అప్పటి కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు సహకారంతో స్ట్రామ్ వాటర్ నిధులను మంజూరు చేయించుకుని డ్రెయిన్ల నిర్మాణం చేశామని చెప్పారు. జగన్మోహన్రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ నిధులను మళ్ళించడమే కాకుండా ఎల్అండ్ కాంట్రాక్టరును వేధించి పనులు వదిలి వెళ్ళిపోయేలా చేశారని చెప్పారు. బుడమేరుకు వరద రాకూడదని, కృష్ణా రిటైనింగ్ వాల్ లీకేజీలు లేకుండా చూడాలని, భవిష్యత్తులో వరదలు వచ్చినా నగరంలో ఇబ్బంది లేకుండా డ్రెయిన్ల బాగుచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు స్పష్టంగా చెప్పారన్నారు. డ్రెయిన్ల నిర్మాణానికి ముఖ్యమంత్రి రూ.200 కోట్లు కేటాయించారన్నారు. తూర్పు నియోజకవర్గంలో గుంటతిప్ప డ్రెయిన్ మరమ్మత్తుకు రూ.17 కోట్లు కేటాయించామన్నారు. కనకదుర్గానగర్‌కు ఏ విధమైన ఇబ్బంది లేకుండా పక్కా ప్రణాళికను రూపొందించామని చెప్పారు. ముందుగా రూ.7 కోట్లు నిధులు విడుదల చేశామని చెప్పారు. తూర్పు నియోజకవర్గంలో మొదటిగా చేపట్టే ప్రాజెక్టు గుంటతిప్ప డ్రెయిన్ అని చెప్పారు. ఎంత వర్షం పడినా చుక్క నీరు కూడా నిల్వ ఉండకుండా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. పుల్లేటి సమస్యను కూడా పరిష్కరిస్తామని చెప్పారు. వరద బాధితులకు అండగా ఉండేందుకు ఒకొక్క డివిజన్‌కు ఒక ఐఏఎస్ అధికారి, ఎమ్మెల్యే, మంత్రిని ఇన్చార్జిగా నియమించి చంద్రబాబునాయుడు చేసిన శ్రమను ఎవ్వరూ మరిచిపోరని చెప్పారు. స్ట్రామ్ వాటర్ నిధులు, రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల నుంచి వచ్చే నిధులతో ఎంత పెద్ద వర్షం వచ్చినా చుక్క నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటామని ఆయన చెప్పారు.

ఈ కార్యక్రమంలో గద్దె క్రాంతికుమార్, డివిజన్ కార్పొరేటర్ జాస్తి సాంబశివరావు, గొల్లపూడి నాగేశ్వరరావు, ఎం.సి దాసు, కార్పొరేటర్లు దేవినేని అపర్ణ, ముమ్మనేని ప్రసాద్, పాతూరి సాంబశివరావులతో పాటు డివిజన్ లోని అన్ని కాలనీల పెద్దలు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

## ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుంది

## ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్పష్టీకరణ



నందిగామ, చైతన్యరథం: ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకెళుతోందని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. నందిగామ నియోజకవర్గంలో ఆదివారం పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సౌమ్య శంకుస్థాపన కార్యక్రమం చేపట్టారు. మండలంలోని చెరువుకొమ్ముపాలెం, కొత్త బెల్లంకొండ వారి పాలెం, పెద్దవరం గ్రామాలలో ఎన్ఆర్ఈజీఎస్ నిధుల క్రింద రూ. 35 లక్షల రూపాయల సీసీ రోడ్లు, డ్రైన్ల పనులకు శంకుస్థాపన చేశారు. క్రక్స్ బయోటెక్ కంపెనీ వారి సహకారంతో కొత్త బెల్లంకొండవారి పాలెం గ్రామంలో మంచినీటి వాటర్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాటర్ ప్లాంట్ నిర్మాణానికి ముందుకొచ్చిన క్రక్స్ యాజమాన్యం వారికి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. సూపర్ సిక్స్ పథకాలను అన్నివర్గాల ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ఎజెండాగా, ఇచ్చిన ప్రతి హామీని, మాటను కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుందన్నారు. చెరువుకొమ్ముపాలెం గ్రామంలో వైఎస్ఆర్ పార్టీని వీడి తెలుగుదేశం పార్టీలోకి విచ్చేసిన గ్రామ ఎంపీటీసీ చిలకమ్మ, నాగుల్ నాయక్, కొండా నాయక్, వెంకటరమణ నాయక్ సైదాలకు ఎమ్మెల్యే సౌమ్య పార్టీ కండువా కప్పి కూటమి నేతలతో కలిసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికి కలసి పనిచేద్దాం

## నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపు

నెల్లూరు, చైతన్యరథం: ప్రజా సమస్యల పరిష్కారానికి అందరం కలసి పనిచేద్దామని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం 31వ డివిజన్, టైలర్స్ కాలనీకి చెందిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ముస్లిం మైనార్టీ కార్యదర్శి నాయబ్ రసూల్, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం అందరం కలసి పనిచేద్దాం, అందరికీ ఆహ్వానం పలుకుతున్నానని అన్నారు. నాకు ఓటు వేయనివారు, నాకు వ్యతిరేకంగా పని చేసిన వారికి కూడా ఏమైనా సమస్యలు ఉంటే స్వేచ్ఛగా రండి. నా చేతిలో ఉంటే చేయడానికి మీ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఎప్పుడూ సిద్ధంగా ఉంటాడని అన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి మన్నేపల్లి రఘు, టీడీపీ నాయకులు పల్నాటి మస్తాన్ నాయుడు, ఖాదర్ బాషా టి.వి.ఎస్. కమల్, రెహ్మత్, సతీష్, కమాలుద్దీన్, సత్తాజ్, మస్తాన్, ఖాజా, హనీఫ్, కరీమ తదితరులు పాల్గొన్నారు.

# నష్టపోయిన రైతులందరినీ ఆదుకుంటాం

## మైలవరం ఎమ్మెల్యే

## వసంత కృష్ణప్రసాద్ హామీ

మైలవరం, చైతన్యరథం: ఇటీవల బుడమేరు వరద ఉధృతికి నష్టపోయిన బాధిత రైతులందరినీ ఆదుకుంటామని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ హామీ ఇచ్చారు. జి.కొండూరు మండలం కవులూరు గ్రామంలో ఎమ్మెల్యే కృష్ణప్రసాదు ఆదివారం పర్యటించారు. వరద బాధిత రైతులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పంట నష్టం అంచనాల్లో కవులూరుకు అన్యాయం జరిగిందనే రైతుల ఫిర్యాదు మేరకు ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించారు. కవులూరులో ఆర్.బి.కె వద్ద రైతులతో ఆయన మాట్లాడుతూ పంట నష్టం అంచనాలను పారదర్శకంగా రూపొందిస్తామని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అర్హులైన బాధిత రైతులకు న్యాయం చేస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని వ్యవసాయ శాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు తెలియజేసినట్లు పేర్కొన్నారు. బాధిత రైతులు ఎవరూ



ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మరో మారు పంట నష్టం అంచనా వేసి రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు కూడా చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యే వెంట వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, ఎన్డీఏ మహాకూటమి నాయకులు తదితరులు ఉన్నారు.

# వక్ఫ్ బోర్డ్ నూతన ఛైర్మన్ అబ్దుల్ అజీజ్‌కు చేజర్ల అభినందనలు

నెల్లూరు, చైతన్యరథం: రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మన్‌గా నియమితులైన నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్‌ను ఆదివారం నెల్లూరు హరనాథపురంలోని నివాసంలో కలసి పలువురు తెలుగుదేశం నాయకులు కలసి అభినందనలు తెలిపారు. నెల్లూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధానకార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర టిడిపి ముదిరాజు సాధికార సమితి కన్వీనర్ పి ఎల్ రావు, నెల్లూరు పార్లమెంట్ తెలుగు మహిళ అధ్యక్షురాలు పనబాక భూలక్ష్మి, నెల్లూరు పార్లమెంట్ బిటిడిపి కన్వీనర్ ఏస్‌కే రసూల్, గంగరాజు పి వెంగయ్య, తిరుపతి రాజు, నారా శ్రీనివాసులు నాయుడు,కృష్ణ యాదవ్ మొహమ్మద్, వహీద్, ఉప్పు భాస్కర్, సాబీర్ బాష, అజారుద్దీన్ తదితరులు ఉన్నారు.





# ముంపు ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

జగ్గయ్యపేట, చైతన్యరథం: ఇటీవల కురిసిన వర్షాలకు జగ్గయ్యపేట పట్టణంలో ముంపునకు గురైన ధనంబోర్డు, విద్యానగర్ , దుర్గాపురం కాలనీలో స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఆదివారం పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. అందరినీ అన్నివిధాల ఆదుకుంటామని వారికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ముంపునకు గురైన ప్రాంతంలో గ్రావెల్ ఏర్పాటు చేయాలని, అండర్ గ్రౌండ్ వాటర్‌ను తొలగించాలని మున్సిపల్ అధికారులు, రైల్వే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ సెక్రటరీ మైనేని రాధాకృష్ణ, మాజీ ఏఎంసి ఛైర్మన్ కట్టా వెంకట నరసింహారావు, పట్టణ తెలుగు యువత అధ్యక్షులు వేదులాపురి సైదా, కౌన్సిలర్ పేరం సైదేశ్వరరావు, షేక్ అస్లాం, గింజుపల్లి కృష్ణ, రహీం, జానీ, జాఫర్, నంద, పాము బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## 40 ఎకరాల్లో..

# కొత్త ఎన్‌సీఏని ప్రారంభించిన బీసీసీఐ!



బెంగళూరులో కొత్తగా నిర్మించిన జాతీయ క్రికెట్ అకాడమీ(ఎన్‌సీఏ)ని భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) అధ్యక్షుడు రోజర్ బిన్నీ ప్రారంభించారు. ఆదివారం జరిగిన ఈ కార్యక్రమానికి బీసీసీఐ సెక్రటరీ జై షాతో పాటు ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా హాజరయ్యారు. అధునాతన హంగులతో పాటు ప్రపంచస్థాయి సదుపాయాలతో ఈ స్టేడియాన్ని నిర్మించారు.

24 ఏళ్ల క్రితం 2000ల్లో ఎన్‌సీఏను బీసీసీఐ ప్రారంభించింది. అప్పటి నుంచి చిన్నస్వామి స్టేడియం ప్రాంగణంలోనే ఎన్‌సీఏ నడుస్తోంది. ఇది సరిపోకపోవడంతో బీసీసీఐ.. బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో ఉన్న 40 ఎకరాల్లో కొత్త ఎన్‌సీఏను నిర్మించారు. ఇందులో మూడు ప్రపంచస్థాయి మైదానాలు, ఇండోర్, ఔట్‌డోర్ సహా మొత్తం 86 పిచ్‌లను ఏర్పాటు చేశారు.

ఒలింపిక్ ప్రమాణాలతో స్విమ్మింగ్ పూల్, జిమ్, రీహాబిలిటేషన్ సెంటర్లను కూడా నిర్మించారు. నూతనంగా నిర్మించిన ఈ మైదానాలు ఇంగ్లండ్ కౌంటీ మైదానాలను తలపించేలా ఉన్నాయి. నూతన ఎన్‌సీఏలో నిర్మించిన మూడు మైదానాల్లో ప్రధానమైనది గ్రౌండ్ ఏ. ముంబై ఎర్ర మట్టి పిచ్‌లతో అధునాతన ప్రసార సౌకర్యాలతో తీర్చిదిద్దారు.

అలాగే గ్రౌండ్ బీ, సీ మైదానాలను ఆటగాళ్లు ప్రాక్టీస్ చేసుకునేందుకు అణువుగా కట్టారు. ఇందులో 11 మాండయా మట్టి పిచ్‌లతో పాటు ఒడిశా నుంచి తెచ్చిన తొమ్మిది నల్ల కాటన్ మట్టి పిచ్‌లు ఉన్నాయి. అంతేకాకుండా అధునాతన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేశారు. వర్షం పడినప్పుడు ఆటకి అంతరాయం కలగకుండా ఈ పిచ్‌లు త్వరగా సిద్ధమవుతాయి.

వీటితో పాటు 45 ఔట్‌డోర్ నెట్ ప్రాక్టీస్ పిచ్‌లను కూడా ఏర్పాటు చేశారు. యూకే, ఆస్ట్రేలియా నుంచి ప్రీమియం టర్ఫ్‌లతో 8 పిచ్‌లను సిద్ధం చేశారు. ఇంటిగ్రేటెడ్ కెమెరాలు, సహజ కాంతి కోసం గాజు పలకలు, అతి పెద్ద జిమ్, 3 వేల స్క్వేర్ యార్డ్స్‌లో అతి పెద్ద డ్రెస్సింగ్ రూంలను నిర్మించారు.

# హ్యారీ బ్రూక్ విధ్వంసం

*- 52 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్స్‌లతో 72 పరుగులు*



ఇంగ్లండ్ స్టార్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ చరిత్ర సృష్టించాడు. ఆస్ట్రేలియాతో జరుగుతున్న ఐదు వన్డేల సిరీస్‌లో విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగుతున్న బ్రూక్.. ఆదివారం జరిగిన చివరి వన్డేలోనూ అదే జోరు కనబర్చాడు. 52 బంతుల్లో 3 ఫోర్లు, 7 సిక్స్‌లతో 72 పరుగులు చేశాడు. ఓపెనర్ బెన్ డక్కెట్(91 బంతుల్లో 13 ఫోర్లు, 2 సిక్స్‌లతో 107)తో కలిసి నాలుగో వికెట్‌కు 132 పరుగులు జోడించాడు.

ఈ విధ్వంసకర ఇన్నింగ్స్‌తో హ్యారీ బ్రూక్ అరుదైన ఘనతను సొంతం చేసుకున్నాడు. ఓ ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లో ఆస్ట్రేలియాపై అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. 5 వన్డేల్లో ఓ సెంచరీతో పాటు రెండు హాఫ్ సెంచరీలు బాదిన హ్యారీ బ్రూక్.. 312 రన్స్ చేశాడు. ఈ క్రమంలో విరాట్ కోహ్లి రికార్డును హ్యారీ బ్రూక్ అధిగమించాడు. 2019లో ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్‌లో కోహ్లి 310 పరుగులు చేశాడు. ఇప్పటి వరకు ఇదే రికార్డ్‌గా ఉండగా.. తాజాగా హ్యారీ బ్రూక్ బద్దలు కొట్టాడు.

ఈ జాబితాలో హ్యారీ బ్రూక్(312), కోహ్లి(310) తర్వాత ధోనీ(285), ఇయాన్ మోర్గాన్(278), బాబర్ ఆజామ్(276) ఉన్నారు. ఈ సిరీస్‌లో ఇంగ్లండ్ తొలి రెండు వన్డేలు ఓడి 0-2తో నిలవగా.. హ్యారీ బ్రూక్ సంచలన బ్యాటింగ్‌తో వరుసగా రెండు విజయాలు అందించాడు. మూడో వన్డేలో 110 పరుగులతో సత్తా చాటిన బ్రూక్.. 46 పరుగులతో ఇంగ్లండ్‌ను గెలిపించాడు.

నాలుగో వన్డేలో 58 బంతుల్లో 87 పరుగులు చేసి 186 పరుగుల భారీ విజయాన్ని అందించాడు. చివరి వన్డేలో క్విక్ ఫైర్ నాక్‌తో భారీ స్కోర్ అందించాడు.

ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ నిర్ణీత 50 ఓవర్లలో 309 పరుగులకు కుప్పకూలింది. ఆస్ట్రేలియా బౌలర్లలో ఆరోన్ హార్డీ, ఆడమ్ జంపా, గ్లేన్ మ్యాక్స్‌వెల్ రెండేసి వికెట్లు తీయగా.. ట్రావిస్ హెడ్ 4 వికెట్లు పడగొట్టాడు.

## భారత్ - బంగ్లాదేశ్ రెండో టెస్టు..

# మూడో రోజూ అదే తంతు



ఇండియా వర్సెస్ బంగ్లాదేశ్ రెండో టెస్టుకు వర్షం ఆటంకం కలిగిస్తూనే ఉంది. మూడో రోజు ఆట కూడా ఒక్క బంతి పడకుండానే తుడిచిపెట్టుకుపోయింది. వర్షం లేకున్నా.. మైదానంలోని ఓవైపు ఔట్ ఫీల్డ్ మొత్తం చిత్తడిగా మారడంతో పలుమార్లు పరిశీలించిన అంపైర్లు చివరకు మూడో రోజు ఆటను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు.

అర్థ రాత్రి కురిసిన భారీ వర్షంతో ఔట్ ఫీల్డ్‌లో ఓవైపు పూర్తిగా నీరు నిలిచిపోయింది. గ్రౌండ్ స్టాఫ్ వాటిని తొలగించే ప్రయత్నం చేసినా.. ఫలితం లేకపోయింది. దాంతో ఇరు జట్ల ఆటగాళ్లు నిరాశగా మైదానాన్ని వీడారు. ఈ మ్యాచ్‌లో తొలి రోజు ఆటలో 55 ఓవర్లు మింగేసిన వరుణుడు.. రెండో రోజు ఆటలో ఒక్క బంతి కూడా పడనివ్వలేదు. మూడో రోజు ఆట కూడా రద్దవ్వడంతో ఈ మ్యాచ్ డ్రా అయ్యే అవకాశాలు ఉన్నాయి.

చివరి రెండు రోజుల ఆట సాధ్యమైనా.. అద్భుతం జరిగితే తప్పా ఫలితం తేలడం కష్టం. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన టీమిండియా బౌలింగ్ ఎంచుకోవడంతో బంగ్లాదేశ్ ముందుగా బ్యాటింగ్ చేసింది. తొలి రోజు వర్షంతో మ్యాచ్ నిలిచిపోయే సమయానికి బంగ్లాదేశ్ 35 ఓవర్లలో 3 వికెట్లకు 107 పరుగులు చేసింది. క్రీజులో మోమినల్ హక్(40 నాటౌట్), ముష్ఫికర్ రహీమ్(6 బ్యాటింగ్) ఉన్నారు. నజ్ముల్ హొస్సేన్ షాంటో(31), షెడ్‌మన్ ఇస్లామ్(24), జకీర్ హసన్(0) విఫలమయ్యారు.

భారత బౌలర్లలో ఆకాశ్ దీప్ రెండు వికెట్లు తీయగా.. రవిచంద్రన్ అశ్విన్ ఓ వికెట్ పడగొట్టాడు. మ్యాచ్ ప్రారంభమైన తొలి మూడు రోజులు వర్షం కురుస్తుందని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరించింది. భారత్ తుది జట్టులో ఎలాంటి మార్పులు లేకుండా విన్నింగ్ కాంబినేషన్‌ను కొనసాగించింది.

చివరి రెండు రోజులు ఆట సాధ్యమయ్యే అవకాశాలు ఉండటం.. కాన్పూర్ అభిమానులకు పెద్ద ఊరట.

ఈ మ్యాచ్ డ్రాగా ముగిస్తే టీమిండియాకు నష్టం జరగనుంది. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్ షిప్ 2025 పాయింట్స్ టేబుల్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్న టీమిండియాకు ఆ స్థానాన్ని మరింత పదిలం చేసుకోవాలంటే ఈ మ్యాచ్ గెలవడం చాలా కీలకం. ఒక వేళ మ్యాచ్ డ్రా అయితే .. తదుపరి 8 టెస్ట్‌ల్లో 6 మ్యాచ్‌లు తప్పక గెలవాల్సి ఉంటుంది. టీమిండియా సొంతగడ్డపై న్యూజిలాండ్‌తో మూడు టెస్ట్‌లు.. ఆస్ట్రేలియా గడ్డపై 5 మ్యాచ్‌ల బోర్డర్ గవాస్కర్ ట్రోఫీ ఆడనుంది.

# ఐపీఎల్ 2025 మెగా వేలం.. 10 ఫ్రాంచైజీల రిటెన్షన్ జాబితా ఇదే..!

ఐపీఎల్ 2025 మెగా వేలానికి సంబంధించిన రిటెన్షన్ పాలసీని భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) ఖరారు చేసింది. ప్రతీ ఫ్రాంచైజీ ఆరుగురు ఆటగాళ్లను రిటైన్ చేసుకోవచ్చని శనివారం ప్రకటించింది. ఇందులో ఒక రైట్ టు మ్యాచ్(ఆర్‌టీఎం) కార్డ్ కూడా ఉంది. అట్టిపెట్టుకున్న ఐదుగురి ఆటగాళ్ల కోసం రూ.75 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది.

ప్రతీ జట్టు పర్స్ వాల్యూను రూ. 120 కోట్లకు పెంచింది. రిటైన్ చేసుకునే ఆటగాళ్లకు వరుసగా రూ. 18 కోట్లు, రూ. 14 కోట్లు, రూ. 11 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. నాలుగు, ఐదో ఆటగాడిని తీసుకోవాలనుకుంటే తిరిగి రూ. 18 కోట్లు, రూ. 14 కోట్లు ఇవ్వాల్సి ఉంటుంది. ఐదుగురు ఆటగాళ్లను రిటైన్ చేసుకుంటే రూ. 45 కోట్లు మాత్రమే మిగులుతాయి.

ఈ డబ్బుతోనే వేలంలో ఆర్‌టీఎమ్‌తో పాటు 15 మంది ఆటగాళ్లను కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అనామక ఆటగాళ్లను రిటైన్ చేసుకోవాలనుకుంటే రూ. 4 కోట్లు చెల్లించాల్సి ఉంటుంది. గరిష్టంగా ఇద్దరు అనామక ఆటగాళ్లతో పాటు ఐదుగురు క్యాప్‌డ్ ప్లేయర్లను తీసుకోవచ్చని తెలిపింది. ఈ ఐదుగురు క్యాప్‌డ్ ప్లేయర్లలో విదేశీ ఆటగాళ్లపై ఎలాంటి పరిమితి విధించలేదు.

ఐదేళ్ల పాటు అంతర్జాతీయ క్రికెట్‌కు దూరంగా ఉండటంతో పాటు బీసీసీఐ కాంట్రాక్ట్ లేని ఆటగాడిని అనామక ప్లేయర్‌గా పరిగణించవచ్చని పేర్కొంది. ఇది సీఎస్‌కేకు కలిసి రానుంది. మహేంద్ర సింగ్ ధోనీని అనామక ప్లేయర్‌గా రూ. 4 కోట్లకే ఆ జట్టు తీసుకోనుంది. అయితే ఆరుగురు ఆటగాళ్లను రిటైన్ చేసుకుంటే రూ. 75 కోట్లు ఖర్చు అవనున్నాయి.



ఈ క్రమంలో ఫ్రాంచైజీలు ఆరుగురు ఆటగాళ్లను రిటైన్ చేసుకునేందుకు పెద్దగా ఆసక్తి చూపకపోవచ్చు. ముంబై, కేకేఆర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ టీమ్స్ మినహా ఇతర జట్లు ఆరుగురు ఆటగాళ్లను రిటైన్ చేసుకోకపోవచ్చు. 10 ఫ్రాంచైజీల రిటెన్షన్ జాబితా అంచనాపై ఓ లుక్కేద్దాం.

***10 ఫ్రాంచైజీల రిటెన్షన్ జాబితా(అంచనా)***

**ఆర్‌సీబీ:** విరాట్ కోహ్లి, మహమ్మద్ సిరాజ్, రజత్ పటీదార్, విజయ్‌కుమార్ వైశాఖ్(అనామక), విల్ జాక్స్-ఆర్‌టీఎమ్, యశ్ దయాల్-ఆర్‌టీఎమ్

**సీఎస్‌కే:** రవీంద్ర జడేజా, రుతురాజ్ గైక్వాడ్, శివమ్ దూబే-ఆర్‌టీఎమ్, మతీష పతీరణ, మహేంద్ర సింగ్ ధోనీ(అనామక), తుషార్ దేశ్‌పాండే-ఆర్‌టీఎమ్

**ఢిల్లీ క్యాపిటల్స్:** రిషభ్ పంత్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, జేక్ ఫ్రెసర్ మెక్‌గర్క్-ఆర్‌టీఎమ్, ట్రిస్టన్ స్టబ్స్-ఆర్‌టీఎమ్, అభిషేక్ పోరెల్(అనామక)-ఆర్‌టీఎమ్

**గుజరాత్ టైటాన్స్:** శుభ్‌మన్ గిల్, రషీద్ ఖాన్, సాయి సుదర్శన్, మహమ్మద్ షమీ-ఆర్‌టీఎమ్, డేవిడ్ మిల్లర్-ఆర్‌టీఎమ్, రాహుల్ తేవాటియా(అనామక)-ఆర్‌టీఎమ్

**లక్నో సూపర్ జెయింట్స్:** నికోలస్ పూరన్, కేఎల్ రాహుల్, మార్కస్ స్టోయినీస్-ఆర్‌టీఎమ్, మయాంక్ యాదవ్

**కేకేఆర్:** ఆండ్రీ రస్సెల్, సునీల్ నరైన్, రింకూసింగ్, వరుణ్ చక్రవర్తి/హర్షిత్ రాణా-ఆర్‌టీఎమ్, శ్రేయస్ అయ్యర్/వెంకటేశ్ అయ్యర్-ఆర్‌టీఎమ్

**ముంబై ఇండియన్స్:** జస్‌ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ యాదవ్, హార్దిక్ పాండ్యా, తిలక్ వర్మ-ఆర్‌టీఎమ్, ఇషాన్ కిషన్-ఆర్‌టీఎమ్, నెహాల్ వదేరా(అనామక)-ఆర్‌టీఎమ్

**పంజాబ్ కింగ్స్:** అర్షదీప్ సింగ్, జితేష్ శర్మ, లియామ్ లివింగ్ స్టోన్, శశాంక్ సింగ్(అనామక), అషుతోష్ శర్మ(అనామక), ప్రభ్‌సిమ్రాన్ సింగ్-ఆర్‌టీఎమ్

**రాజస్థాన్ రాయల్స్:** సంజూ శాంసన్, యశస్వి జైస్వాల్, జోస్ బట్లర్, యుజ్వేంద్ర చాహల్/ధ్రువ్ జురెల్-ఆర్‌టీఎమ్, సందీప్ శర్మ(అనామక)-ఆర్‌టీఎమ్, రియాన్ పరాగ్-ఆర్‌టీఎమ్

**సన్‌రైజర్స్ హైదరాబాద్:** ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, నితీష్ కుమార్ రెడ్డి-ఆర్‌టీఎమ్, హెన్రిచ్ క్లాసెన్, ప్యాట్ కమిన్స్-ఆర్‌టీఎమ్

# పుణె మెట్రో సెక్షన్‌ను ప్రారంభించిన మోదీ



పుణె: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదివారం న్యూ పుణె మెట్రో సెక్షన్‌ను ప్రారంభించారు. జిల్లా కోర్టు, స్వర్‌గేట్ మధ్య నడిచే ఈ భూగర్భ మార్గంతో పుణెలోని అర్బన్ ట్రాన్స్‌పోర్టేషన్ గణనీయంగా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. దీంతో పాటు రూ.11,200 కోట్ల విలువ చేసే ప్రాజెక్టుల శంకుస్థాపన చేసి, జాతికి అంకితం చేశారు. వర్చువల్ తరహాలో వీటిని ప్రధాని ప్రారంభించారు. షెడ్యూల్ ప్రకారం ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రధాని హాజరుకావాల్సి ఉన్నప్పటికీ వాతావరణ ప్రతికూలత దృష్ట్యా ఆయన పర్యటన రద్దయింది.

### మహాయుతి సర్కార్ విజన్

ప్రధాని వర్చువల్ తరహాలో ప్రారంభోత్సవాల సందర్భంగా మహారాష్ట్రలోని అధికార మహాయుతి ప్రభుత్వంపై ప్రశంసలు కురిపించారు. పుణెలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా సామర్థ్యం కూడా పెంచుకుంటూపోవాలని, పుణె పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను ఆధునీకరించినప్పుడే ఇది సాధ్యమవుతుందన్నారు. ఇందుకోసం తాము అనేక చర్యలు చేపట్టామన్నారు. సిటీ పెరుగుతున్నప్పుడు ఏరియాల మధ్య అనుసంధానం కూడా గణనీయంగా పెరగాలన్నారు. ఇదే విజన్‌తో మహాయుతి ప్రభుత్వం రేయింబవళ్లు శ్రమిస్తోందని చెప్పారు.

మహారాష్ట్రలో ఇంతకముందు అధికారంలో ఉన్న మహా వికాస్ అఘాడి (ఎంవీఏ) ప్రభుత్వం కనీసం ఒక మెట్రో పిల్లర్‌ను కూడా నిర్మించలేక పోయిందన్నారు. కానీ తమ ప్రభుత్వం పుణెలో మెట్రో నెట్‌వర్క్‌ను నిర్మించిందన్నారు. సోలార్ ఎయిర్‌పోర్ట్ అప్‌గ్రేడేషన్‌పై మాట్లాడుతూ, ఇవాళ విఠల్ భగవానుని ఆశీస్సులతో నేరుగా షోలాపూర్‌కు ఎయిర్ కనెక్టివిటీ కల్పించేందుకు ఎయిర్‌పోర్ట్ అప్‌గ్రేడేషన్ పూర్తయిందని చెప్పారు.



# ఢిల్లీలో తెలుగు విద్యార్థుల ఆందోళన

న్యూఢిల్లీ : తిరుపతి లడ్డూ ప్రసాదం కల్తీని నిరసిస్తూ ఆదివారం ఢిల్లీలో తెలుగు విద్యార్థులు ఆందోళన చేపట్టారు. సనాతన ధర్మ విలువల పరిరక్షణకు మద్దతుగా ఆల్ ఇండియా తెలుగు స్టూడెంట్స్ అండ్ యూత్ అసోసియేషన్ పెద్దఎత్తున ర్యాలీ చేపట్టింది. ఢిల్లీ గోల్ మార్కెట్‌లోని టీటీడీ ఆలయం నుంచి ఏపీ భవన్ వరకూ విద్యార్థులు భారీ ర్యాలీ చేపట్టారు. వేలాది మంది విద్యార్థులు రోడ్లపైకి వచ్చి టీటీడీ ఆలయానికి దిష్టి తీసి కొబ్బరికాయలు కొట్టారు. తెలుగు విద్యార్థుల ర్యాలీ నేపథ్యంలో టీటీడీ ఆలయం, ఏపీ భవన్ వద్ద పోలీసులు భారీగా మోహరించారు.

### కేంద్ర హోంశాఖ మంత్రి

# అమిత్ షా ఆగ్రహం

హర్యానా: కాంగ్రెస్ సభల్లో పాకిస్థాన్ అనుకూల నినాదాలు చేయడమేమిటని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ధ్వజమెత్తారు. హర్యానా అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న వేళ కాంగ్రెస్ నిర్వహిస్తున్న సభల్లో ఈ నినాదాలు లేవనెత్తుతున్నారని ఆయన అన్నారు. బాద్షాపుర్ ర్యాలీలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. రాహుల్ గాంధీపై విరుచుకుపడ్డారు. బుజ్జగింపు రాజకీయాలతో కాంగ్రెస్‌కు కంటిమీద కునుకులేకుండా పోయిందన్నారు.

"హర్యానాలో కొత్త ట్రెండ్ చూస్తున్నాను. హతిన్ నుంచి థానేసర్ వరకు, థానేసర్ నుంచి పల్వల్ వరకు పాకిస్థాన్ అనుకూల నినాదాలు మిన్నంటుతున్నాయి. మీ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఇలాంటి నినాదాలు చేస్తుంటే ఎందుకు మాట్లాడకుండా ఉంటున్నారు?" అని రాహుల్ గాంధీని ప్రశ్నించారు. ఆర్టికల్ 370 తిరిగి తీసుకొస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీపై ఆయన విరుచుకుపడ్డారు.

కశ్మీర్ మనదా? కాదా? ఆర్టికల్ 370ని తొలగించడం సరైందా? కాదా? ఈ ఆర్టికల్‌ను మళ్లీ తీసుకొస్తామని కాంగ్రెస్,




రాహుల్ చెబుతున్నారు. రాహుల్ గాంధీ.. మరో మూడు తరాలు మారినా దీన్ని వెనక్కి తీసుకురాలేవు. కశ్మీర్‌ను రక్షించేందుకు హర్యానా యువత ఎన్నో త్యాగాలు చేసింది. వాటిని వృథా కానివ్వం" అని అమిత్ షా అన్నారు. కాగా.. హరియాణాలో అక్టోబరు 5న అసెంబ్లీ ఎన్నికలు జరగనుండగా.. ఫలితాలు 8న విడుదల కానున్నాయి. ఈ ఎన్నికల్లో అధికారాన్ని చేజిక్కించుకునేందుకు కాంగ్రెస్, భాజపాతో సహా ఇతర పార్టీలు తీవ్రంగా యత్నిస్తున్నాయి.

# రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ స్పష్టీకరణ

పాట్నా: వచ్చే నెల 2న బీహార్‌లో కొత్త రాజకీయ పార్టీని ప్రారంభించనున్నట్లు రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ తెలిపారు. పార్టీ పేరు, నాయకత్వంతో సహా అన్ని వివరాలు ఆ రోజు వెల్లడిస్తానని చెప్పారు. 'జన సురాజ్' పేరుతో బీహార్‌లో పాదయాత్ర చేస్తున్న ప్రశాంత్ కిషోర్ ఆదివారం మీడియాతో మాట్లాడారు. ' అక్టోబరు 2న కొత్త పార్టీ 'జన సూరజ్'తోపాటు నాయకత్వ ప్రకటన గురించి మీరు తెలుసుకుంటారు. నేను నాయకుడిని కాదు. నాయకుడు కావాలని ఎప్పుడూ ఆశించలేదు. అక్టోబర్ 2న ఏర్పాటవుతున్న ఈ పార్టీకి నేనెప్పుడూ నాయకుడిగా ఉండను. ప్రజలు నాయకత్వ పాత్ర పోషించాల్సిన సమయం ఇది' అని అన్నారు. కాగా, 2022 అక్టోబర్ 2న చేపట్టిన 'జన సూరాజ్' పాద యాత్ర మొదటి దశలో భాగంగా బీహార్‌లో 60 శాతం ప్రాంతాలను పూర్తి చేసినట్లు ప్రశాంత్ కిషోర్ తెలిపారు. ఈ యాత్రకు నిర్ణీత రోజులు లేదా కిలోమీటర్ల సంఖ్య లేదన్నారు. ప్రధానంగా మూడు ఉద్దేశాలు నెరవేర్చడం కోసం బీహార్‌లోని ప్రతి మూలకు వెళ్లాలన్నది తన లక్ష్యమని చెప్పారు.





# డిప్యూటీ సీఎంగా ఉదయనిధి స్టాలిన్

చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ తనయుడు ఉదయనిధి స్టాలిన్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా పదోన్నతి పొందారు. మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణలో భాగంగా మొత్తం నలుగురు ఎమ్మెల్యేలు మంత్రులుగా ప్రమాణం చేశారు. మనీలాండరింగ్ కేసులో జైలుకు వెళ్లి, రెండు రోజుల క్రితం బెయిల్‌పై విడుదలైన మాజీ మంత్రి సెంథిల్ బాలాజీ మంత్రిగా ప్రమాణం చేసిన వారిలో ఉన్నారు. అలాగే గోవి చెళియన్, ఎస్‌ఎం నాజర్, ఆర్.రాజేంద్రన్లు కూడా మంత్రులుగా ప్రమాణస్వీకారం చేశారు. సెంథిల్‌కు విద్యుత్, ఎక్సైజ్ శాఖ, చెళియన్‌కు విద్యాశాఖ, నాజర్‌కు మైనార్టీ వ్యవహారాలు, రాజేంద్రన్‌కు పర్యాటక శాఖలను కేటాయించారు. పునర్ వ్యవస్థీకరణ సాధారణమైనదే అయినప్పటికీ ఈసారి ఉదయనిధికి డిప్యూటీ సీఎంగా బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఇప్పటికే రాష్ట్ర మంత్రిగా కొనసాగుతున్న ఉదయనిధి ఆదివారం జరిగిన ప్రమాణ స్వీకార కార్యక్రమంలో మళ్లీ ప్రమాణం చేయలేదు. ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి బయలుదేరే ముందు మీడియాతో మాట్లాడిన ఆయన ఉపముఖ్యమంత్రి అనేది తనకు పదవి కాదని, ఓ పెద్ద బాధ్యతని అన్నారు. మరోవైపు ఉదయనిధికి డిప్యూటీ సీఎం బాధ్యతలు అప్పగించడంపై విపక్షాలు విమర్శలు గుప్పించాయి.

# భారత్‌తో సత్సంబంధాలు కొనసాగించి ఉంటే..

### కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్



శ్రీనగర్: జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల వేళ.. పాకిస్థాన్‌పై కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ ఆ దేశం భారత్‌తో సత్సంబంధాలు కొనసాగించి ఉంటే.. అంతర్జాతీయ ద్రవ్యనిధి నుంచి ఇస్లామాబాద్ కోరిన దానికంటే పెద్ద ఆర్థిక ప్యాకేజీని ఇచ్చేవాళ్లమని తెలిపారు. 'ఆర్టికల్ 370' రద్దుపై అక్కసుతో జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదాన్ని పునరుద్ధరించేందుకు యత్నిస్తోందని, ఇక్కడ ప్రజాస్వామ్యం వేళ్లూనుకోవడం ఆ దేశానికి ఇష్టం లేదన్నారు.

"2014-15లో జమ్మూకశ్మీర్ అభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించారు. అది ఇప్పుడు రూ.90 వేల కోట్లకు చేరుకుంది. ఐఎంఎఫ్ నుంచి పాకిస్థాన్ కోరిన బెయిల్‌అవుట్ ప్యాకేజీ కంటే ఇది చాలా పెద్దది. ఒకవేళ ఆ దేశం స్నేహపూర్వక సంబంధాలు కొనసాగించి ఉంటే ఐఎంఎఫ్ కంటే ఎక్కువే సాయం చేసేవాళ్లం" అని ఆదివారం గురేజ్ నియోజకవర్గంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. పొరుగు దేశం చాలా కాలంగా ఆర్థిక సాయాన్ని దుర్వినియోగం చేస్తోందని, తన భూభాగంపై ఉగ్ర కార్యకలాపాల నిర్వహణకు ఇతర దేశాల నుంచి డబ్బు అడుగుతోందని ఆరోపించారు.

భారత్‌కు వ్యతిరేకంగా ఉగ్రవాదాన్ని ఎగదోస్తున్న పాకిస్థాన్.. ఇప్పుడు దాని మిత్రదేశాలు కూడా వదిలేయడంతో అంతర్జాతీయ వేదికలపై ఒంటరిగా మారిందన్నారు. పాక్‌కు మద్దతుగా నిలిచే తుర్కియే ఇటీవల యూఎన్జీఏలో కశ్మీర్ గురించి ప్రస్తావించలేదని గుర్తుచేశారు. భారత్‌పై ఎవరైనా దాడికి పాల్పడితే వాళ్ల భూభాగంపైనే గుణపాఠం చెబుతామన్నారు. ఇదిలాఉండగా.. తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న పాకిస్థాన్.. సాయం కోసం ఐఎంఎఫ్ వంటి సంస్థలను వేడుకుంటున్న విషయం తెలిసిందే.

# ఎన్నికల సభలో సొమ్మసిల్లిన ఖర్గే



శ్రీనగర్: కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే ఎన్నికల సభలో ప్రసంగిస్తుండగా అస్వస్థతకు గురయ్యారు. ఆయనకు కళ్లు తిరుగడంతో పడిపోబోయారు. ఖర్గే పరిస్థితిని గమనించిన కాంగ్రెస్ నేతలు వెంటనే ఆయనను పట్టుకున్నారు. జమ్మూకశ్మీర్‌లోని కతువాలో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పాల్గొన్నారు. ఆ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ఆయన ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన కేంద్ర ప్రభుత్వం, బీజేపీపై మండిపడ్డారు. 'ఈ వ్యక్తులు (కేంద్ర ప్రభుత్వం) ఎన్నడూ ఎన్నికలు నిర్వహించాలని కోరుకోలేదు. సుప్రీంకోర్టు ఆదేశం తర్వాతే ఎన్నికలకు సిద్ధమయ్యారు. వారికి ఎన్నికలు అవసరం లేదు. లెఫ్టినెంట్ గవర్నర్ ద్వారా రిమోట్ కంట్రోల్‌తో ప్రభుత్వాన్ని నిర్వహించాలనుకున్నారు' అని విమర్శించారు. ప్రధాని మోదీ పదేళ్లలో భారతీయ యువతకు ఏమీ ఇవ్వలేదని ఆరోపించారు. 'పదేళ్లలో మీ శ్రేయస్సును తిరిగి తీసుకురాలేని వ్యక్తిని మీరు నమ్ముతారా? బీజేపీ నేత మీ ముందుకు వస్తే మీ శ్రేయస్సు గురించి అడగండి' అని అన్నారు.

## పాకిస్థాన్ వ్యాఖ్యలను గట్టిగా తిప్పికొట్టిన జై శంకర్



ఐక్యరాజ్య సమితి వేదికగా భారత్‌పై పాకిస్థాన్ అక్కసు వెళ్లగక్కిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలను భారత విదేశాంగ శాఖ మంత్రి జై శంకర్ తన ప్రసంగంలో గట్టిగా తిప్పికొట్టారు. సీమాంతర ఉగ్రవాదాన్ని పొరుగు దేశాలపై ఉపయోగిస్తున్న పాకిస్థాన్ అందుకు తగ్గ పర్యవసానాలు కచ్చితంగా ఎదుర్కొంటుందని హెచ్చరించారు. ఐరాస జనరల్ అసెంబ్లీ 79వ సెషన్లో ఆయన ప్రసంగించారు.

'పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదం విధానం ఎప్పటికీ విజయవంతం కాదు. చాలా దేశాలు తమ నియంత్రణకు మించిన పరిస్థితుల కారణంగా వెనుకబడి ఉంటాయి. కానీ, మరికొన్ని దేశాలు వినాశకరమైన పరిణామాల కారణంగా ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటాయి. అందుకు ఉదాహరణ మా పొరుగు దేశమైన పాకిస్థాన్. ఆ దేశ ఆవిర్భావం నుంచి అత్యంత దారుణమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. వారి దుశ్చర్యలు ఇతరులను సైతం ప్రభావితం చేస్తాయి. ముఖ్యంగా పొరుగు ప్రాంతాలను. రాజకీయాలతో మతోన్మాదాన్ని ప్రేరేపిస్తున్న ఆ దేశంలో తీవ్రవాదం, దాని ఎగుమతుల పరంగానే జీడీపీ కొలవాలి. గత ఫోరమ్‌లో కొన్ని విచిత్రమైన వాదనలు విన్నాం. ఈ సందర్భంగా భారత్ వైఖరిని స్పష్టంగా తెలియజేయాలని నిర్ణయించుకున్నాం. సీమాంతర ఉగ్రవాదాన్ని పొరుగు దేశాలపై ఉపయోగిస్తున్న పాకిస్థాన్ అందుకు తగ్గ పర్యవసానాలు కచ్చితంగా ఎదుర్కోవాల్సి ఉంటుంది' అని జై శంకర్ స్పష్టం చేశారు.

ఇక, ఐరాసలో పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ జమ్మూకశ్మీర్ అంశాన్ని లేవనెత్తడంతో పాటు ఆర్టికల్ 370 గురించి ప్రస్తావించారు. పాలస్తీనా ప్రజల మాదిరిగానే జమ్మూకశ్మీర్ ప్రజలు సైతం స్వేచ్ఛ, నిర్ణయాధికారం కోసం పోరాడుతున్నట్లు వ్యాఖ్యానించారు. ఆర్టికల్ 370 రద్దును ప్రస్తావిస్తూ.. భారత్ ఏకపక్షంగా, చట్టవిరుద్ధంగా చేపట్టిన చర్యలు వెనక్కి తీసుకోవాలన్నారు.

## అంతరిక్షంలో వ్యోమగాములను తీసుకొచ్చేందుకు స్పేస్‌ఎక్స్ క్రూ-9 ప్రయోగం



స్టార్‌లైనర్ స్పేస్ క్రాఫ్ట్ సమస్య తలెత్తడంతో వ్యోమగాములు సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్లు అంతరిక్షంలో చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వారిని తిరిగి తీసుకొచ్చేందుకు స్పేస్ఎక్స్ క్రూ–9 మిషన్‌ను ప్రయోగించినట్లు నాసా వెల్లడించింది. ఫ్లోరిడాలోని కేప్ కెనావెరల్ నుంచి ప్రయోగించిన ఈ రాకెట్ అంతరిక్షంలోని వ్యోమగాములను తీసుకుని ఫిబ్రవరిలో తిరిగి రానున్నట్లు తెలిపింది.

ఇందులో నాసా వ్యోమగామి నిక్ హేగ్, రష్యన్ కాస్మోనాట్ అలెగ్జాండర్ గోర్బునోవ్ ఉన్నట్లు నాసా వెల్లడించింది. అంతరిక్షంలో చిక్కుకున్న వ్యోమగాములను తిరిగి తీసుకొచ్చేందుకు ఇందులో రెండు సీట్లు ఖాళీ ఉంచినట్లు తెలిపింది. దీనిని విజయవంతంగా ప్రయోగించిన నాసా, స్పేస్ఎక్స్‌కు నాసా చీఫ్ బిల్ నెల్సన్ అభినందనలు తెలిపారు.

ఇక, 8 రోజులు మిషన్‌లో భాగంగా సునీత, విల్మోర్లు జూన్ 6న బోయింగ్ స్టార్‌లైనర్ క్యాప్సుల్లో అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన సంగతి తెలిసిందే. వాస్తవానికి జూన్ 14న వీరిద్దరూ భూమికి తిరిగి ప్రయాణం కావాల్సి ఉండగా.. వ్యోమనౌకలో హీలియం లీకేజీ కారణంగా సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. ఈ సమస్యను పరిష్కరించిన బోయింగ్.. వ్యోమగాములను తిరిగి భూమిపైకి తీసుకొచ్చేందుకు స్టార్‌లైనర్ సురక్షితమే అని చెప్పింది. కానీ, నాసా అందుకు అంగీకరించలేదు. దీంతో స్టార్‌లైనర్ న్యూ మెక్సికోలోని వైట్ శాండ్స్ స్పేస్ హార్బర్‌లో సురక్షితంగా కిందకు దిగింది.

ఇజ్రాయెల్ వైమానిక దాడిలో హెజ్‌బొల్లా అధినేత హసన్ నస్రల్లా మృతిచెందడంతో హెజ్‌బొల్లాకు గట్టి దెబ్బ తగిలింది. దీంతో హెజ్ బొల్లా మరింత తీవ్రంగా ఇజ్రాయెల్‌పై విరుచుకుపడే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ సమయంలో ఇరాన్ భద్రతా మండలి అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఇప్పటికే ఈ విషయంలో ఇరాన్ మద్దతిస్తుందని ప్రకటించిన విషయం తెలిసిందే. దీనిపై భద్రతా మండలి ఎటువంటి నిర్ణయం తీసుకుంటుందో తెలియాల్సి ఉంది. అయితే ఇజ్రాయెల్‌పై యెమెన్, లెబనాన్, సిరియా తీవ్రంగా విరుచుకుపడే అవకాశముందని.. ఈ దాడులకు ఇరాన్ అండగా నిలుస్తుందని సమాచారం.

ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మాట్లాడుతూ లెబనాన్ ప్రజలకు, హెజ్ బొల్లాకు అండగా ఉండాలని, దాడులను ఎదుర్కోవడంలో వారికి సహాయం చేయాలని అంతర్జాతీయ సమాజానికి పిలుపునిచ్చారు. గాజాలో ఏడాదికాలంగా జరుగుతోన్న యుద్ధం నుంచి వారు (ఇజ్రాయెల్) ఏమీ నేర్చుకోలేదన్నారు. మహిళలు, పిల్లలు, పౌరుల సామూహిక హత్యలు ఆ ప్రతిఘటన శక్తుల్ని విచ్ఛిన్నం చేయలేవని వారికి ఇంకా అర్థంకాలేదని వ్యాఖ్యానించారు. నస్రల్లా హత్య తర్వాత ఖమేనీని ఇరాన్లోని సురక్షిత ప్రదేశానికి తరలించినట్లు సమాచారం. నస్రల్లా హత్యను ఖండిస్తూ.. ఇజ్రాయెల్ దాడికి వ్యతిరేకంగా ప్రతీకారం తీర్చుకోవాలని కోరుతూ టెహ్రాన్‌లో వేలాది మంది ఇరానియన్లు వీధుల్లోకి వచ్చి నిరసన తెలిపారు.

అయితే నస్రల్లా హత్యను ఇజ్రాయెల్ ధృవీకరించిన అనంతరం సిరియాలో ప్రజలు సంబరాలు చేసుకున్నారు. సిరియా విప్లవాని అణచివేయడానికి అప్పటి హెజ్ బొల్లా అధ్యక్షుడు బషర్ అల్- అస్సాద్‌కు మిలిటెంట్ గ్రూప్ సహాయం చేసినందున అక్కడి ప్రజలు వారిని శత్రువులుగా చూస్తారు. అంతర్యుద్ధం సమయంలో వేలాది మంది సిరియన్లు హెజాబొల్లా దాడుల్లో ప్రాణాలు కోల్పోయారు.

శనివారం లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన



దాడుల్లో 33 మంది మరణించారని, మరో 195 మంది గాయపడ్డారని లెబనీస్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. గత రెండు వారాల్లో ఇజ్రాయెల్ –దాడుల్లో 1,000 మందికి పైగా మరణించారని పేర్కొంది. దాదాపు 6,000 మందికి పైగా గాయపడ్డారని, వందల సంఖ్యలో ప్రజలు ఇతర ప్రాంతాలకు తరలిపోయారని తెలిపింది. కొన్ని రోజుల నుంచి లెబనాన్‌పై ఇజ్రాయెల్ పూర్తిస్థాయిలో దాడులు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ వారంలోనే దాదాపు 17 మంది హెజ్ బొల్లా సీనియర్ కమాండర్లను మట్టుబెట్టింది.

### ఇజ్రాయెల్ బీకర దాడులు.. హెజ్‌బొల్లాకు మరో దెబ్బ

లెబనాన్ ఉగ్రవాద గ్రూపు హెజ్‌బొల్లాకు మరోసారి ఊహించని దెబ్బతగిలింది. ఇజ్రాయెల్ ఆదివారం జరిపిన వైమానిక దాడుల్లో హెజ్‌బొల్లా కీలక నేత నబిల్ కౌక్ హతమయ్యాడు. హెజ్‌బొల్లా సెంట్రల్ కౌన్సిల్‌లో డిప్యూటీ హెడ్‌గా ఉన్న నబిల్ మృతిచెందినట్లు ఇజ్రాయెల్ సైన్యం వెల్లడించింది. అయితే, దీనిపై హెజ్ బొల్లా నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. గత కొన్ని వారాలుగా లెబనాన్‌పై ఇజ్రాయెల్ కొనసాగిస్తోన్న భీకరదాడుల్లో హెజ్బొల్లాకు చెందిన పలువురు సీనియర్ కమాండర్లు హతమైన విషయం తెలిసిందే. శుక్రవారం జరిగిన దాడిలో హెజ్‌బొల్లా అధినేత హసన్ నస్రల్లా (64) మృతి చెందడం ఆ గ్రూపునకు శరాఘతంలా మారింది. ఈ తరుణంలోనే మరో కీలక నేతను కోల్పోవడం గమనార్హం. నబిల్ 1995 నుంచి 2010 వరకు సౌత్ లెబనాన్‌లోని హెజ్‌బొల్లా మిలటరీ కమాండర్‌గా పనిచేశాడు. 2020లో అతడిపై అమెరికా ఆంక్షలు విధించింది.

### ఇజ్రాయెల్‌పై ప్రతీకార దాడులకు..

# రంగంలోకి హెజ్‌బొల్లా 'బ్లాక్ యూనిట్'



హెజ్‌బొల్లా చీఫ్ నస్రల్లాను మట్టుబెట్టడంతో ఇప్పుడు ఆ సంస్థ ప్రతీకారం ఎలా తీర్చుకొంటుందనే అంశాన్ని ఇజ్రాయెల్ వ్యూహకర్తలు జాగ్రత్తగా గమనిస్తున్నారు. గతంలో ప్రపంచ వ్యాప్తంగా ఇజ్రాయెలీలను లక్ష్యంగా చేసుకొన్న ఓ యూనిట్ మళ్లీ రంగంలోకి దిగొచ్చని నిపుణులు చెబుతున్నారు. అదే యూనిట్ 910. దానిని బ్లాక్ యూనిట్ లేదా షాడో యూనిట్ అని వ్యవహరిస్తారు.

ఆ మిలిటెంట్ సంస్థలో యూనిట్ 910 ఓ కోవర్ట్ విభాగం. గతంలో అమెరికా, ఐరోపా, ఆఫ్రికా, ఆసియాలో ఇజ్రాయెల్ వాసులను లక్ష్యంగా చేసుకొని పలు దాడులు చేసింది. దాదాపు 32 ఏళ్ల క్రితం కూడా నాటి హెజ్‌బొల్లా నాయకుడు అబ్బాస్ అల్ ముసావిని ఇజ్రాయెల్ దళాలు చంపిన సమయంలో ఈ యూనిట్ ప్రతీకార దాడులు చేసింది.

హెజ్ బొల్లా వద్ద ఉన్న అత్యంత రహస్య, ప్రమాదకర యూనిట్లలో దీనిని ఒకటిగా భావిస్తారు. తలాల్ హమియా అలియాస్ అబు జాఫర్ దీనికి నాయకత్వం వహిస్తున్నాడు. లెబనాన్ బయట హెజ్ బొల్లా దాడులను ఇదే నిర్వహిస్తుంది. ఇరాన్‌కు చెందిన రివల్యూషనరీ గార్డ్స్ కోర్తో కలిసి పనిచేస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా దీనికి టెర్రర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉందని రీసెర్చర్ మాల్ బారీ పేర్కొన్నారు. వాటి సాయంతో ఇది వేగంగా దాడుల చేస్తుందన్నారు.

గతంలో 1992లో ఈ యూనిట్ బ్యూనస్ ఎయిర్స్‌లో ఇజ్రాయెల్ దౌత్యకార్యాలయంపై బాంబు దాడి చేసింది. 1994లో అర్జెంటీనాలో యూదు కమ్యూనిటీ సెంటర్‌పై, 2012లో ఇజ్రాయెలీ పర్యటకుల బస్సుపై ఆత్మాహుతి దాడి చేసింది. కొన్నేళ్ల నుంచి ఈ యూనిట్ దక్షిణ అమెరికా, ఆఫ్రికా, ఆసియాలో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. అమెరికా, ఐరోపాలో కూడా దీని కదలికలు గుర్తించారు. పశ్చిమ దేశాలపై పరోక్ష యుద్ధానికి ఈ యూనిట్ ఇరాన్కు బాగా ఉపయోగపడుతోందని బారీ పేర్కొన్నారు.

ఇటీవల కాలంలో యూనిట్ 910 అమెరికాలోని జేకేఎఫ్ ఎయిర్పోర్టుపై దాడికి ప్రణాళిక సిద్ధం చేయగా చివరి నిమిషంలో భగ్నం చేశారు. దాని ఆపరేటివ్ అలీ కౌరానిని అరెస్టు చేయడంతో అమెరికా, ఇజ్రాయెల్‌పై హెజ్‌బొల్లా కుట్ర బయటపడింది.

నేపాల్ దేశాన్ని భారీ వర్షాలు, వరదలు అతలాకుతలం చేస్తున్నాయి. గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరదలు పోటెత్తాయి. ఈ వరదలకు రాజధాని ఖాట్మండు సహా ఎనిమిది జిల్లాల్లో పెద్ద ఎత్తున మరణాలు సంభవించాయి. ఆదివారం ఉదయానికి నేపాల్ వరద మృతుల సంఖ్య 112కు చేరింది. మరో 68 మంది ఆచూకీ లేకుండా పోయారు.

మృతుల్లో కాభ్రే పాలన్‌చౌక్ ఏరియాకు చెందిన వారు 34 మంది, లలిత్‌పూర్‌కు చెందిన వారు 20 మంది, దాడింగ్‌కు చెందిన వారు 15 మంది, ఖాట్మండుకు చెందిన వారు 12 మంది, మక్వాన్‌పూర్‌కు చెందిన వారు ఏడుగురు, సింధ్‌పాల్ చౌక్‌కు చెందిన వారు నలుగురు, డోలఖకు చెందిన వారు ముగ్గురు, పంచ్‌తర్, భక్తపూర్ జిల్లాలకు చెందిన వారు ఐదుగురు చొప్పున ఉన్నారు.

ఆ నీరంతా సమీపంలోని గ్రామాల్లోకి పోటెత్తింది. దాంతో అనేక ప్రాంతాలు వరద గుప్పిట్లో చిక్కుకుపోయాయి. దాదాపు 1,244 ఇళ్లు పూర్తిగా నీట మునిగాయి. దేశవ్యాప్తంగా 44 జిల్లాల్లో వరదలు బీభత్సం సృష్టించినట్లు సదరు మీడియా పేర్కొంది. పలుచోట్ల కొండచరియలు విరిగిపడటం లాంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. రోడ్లు



ధ్వంసమయ్యాయి.

వరదల కారణంగా అధికారులు 39 జిల్లాల్లో రహదారులను పూర్తిగా మూసివేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు సహాయక చర్యలు చేపట్టినట్లు స్థానిక మీడియా తెలిపింది. దాదాపు 3 వేల మంది భద్రతా సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొంటున్నట్లు పేర్కొంది. ఇప్పటివరకు వెయ్యి మంది వరకు బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. సహాయక చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి.